

పెన్ పవర్
రాయలసీమ
తిరుపతి । చిత్తూరు । అన్నమయ్య । వై.ఎస్.ఆర్ కడప । నంద్యాల । కర్నూలు । అనంతపురం

# విజయం కోసం కష్టపడ్డ కార్యకర్తలకు అండగా ఉంటా





## నష్టపోయిన కార్యకర్తలకు న్యాయం

## పంచాయతీలో సమిష్టిగా తీసుకునే నాయకులు నిర్ణయమే ఫైనల్

## నాయకుల సమీక్షలో ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

## భారీగా టెంకాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్న నాయకులు

**పలమనేరు జూలై 17,(పెన్ పవర్):**తెలుగుదేశం పార్టీ గెలుపు కోసం కష్టపడ్డ కార్యకర్తలకు అండగా ఉంటామని మాజీమంత్రి, పలమనేరు ఎమ్మెల్యే ఎన్.అమర్నాథ్ రెడ్డి పేర్కొన్నారు. పలమనేరు నియోజకవర్గం వీ.కోట మండల కేంద్రంలో బుధవారం ఆయన మండల ముఖ్య నాయకులతో ఓ ప్రైవేట్ కన్వెన్షన్ హాలులో ఎన్నికల ఫలితాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ.... ఎన్నికలలో తన గెలుపు కోసం కృషి చేసిన ప్రతి ఒక్కరికి అండగా ఉంటానని పార్టీ కోసం పనిచేసి కష్టంతోపాటు నష్టాలను చవి చూసిన కార్యకర్తలను ఆర్థికంగానూ ఆదుకునేందుకు కృషి చేస్తామన్నారు. గతానికి భిన్నంగా ఈ దఫా పరిపాలన ఉంటుందని పంచాయితీల వారీగా నాయకులు సమిష్టిగా తీసుకునే నిర్ణయం మేరకే స్థానికంగా పనులు జరుగుతాయన్నారు. కాబట్టి నాయకులందరూ ఏకమై సమిష్టిగా నిర్ణయాలు చేయాలని సూచించారు.ఇక మనపై భరోసాతో ఓట్లు వేసి గెలిపించిన ప్రజలకు సైతం న్యాయం చేసేలా నాయకుల పనితీరు ఉండాలన్నారు. అనంతరం పంచాయతీల వారీగా ఎన్నికల ఫలితాలపై సమీక్ష నిర్వహించి కొన్ని బూత్ లలో మెజారిటీ రాకపోవడానికి గల కారణాలను ఆయన అడిగి తెలుసుకున్నారు.

**భారీగా టెంకాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్న నాయకులు**

ఎన్నికల్లో అమరనాథ రెడ్డి ఎమ్మెల్యేగా గెలవాలని ఆకాంక్షిస్తూ పలువురు నాయకులు చేసుకున్న మొక్కుబడిలో భాగంగా 600 టెంకాయలను కొట్టి తమమొక్కులు చెల్లించుకున్నారు. ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక ఆంజనేయస్వామి ఆలయములో ప్రత్యేక పూజలు అనంతరం నాయకులు ఈమొక్కుబడి కార్యక్రమాన్ని చేపట్టారు.తొలుత ఎమ్మెల్యే టెంకాయను కొట్టి కార్యక్రమాన్ని ప్రారంభించగా పెద్ద ఎత్తున నాయకులు కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

**సకాలంలో మెరుగైన సేవలు అందించాలి**

**వీ.కోట ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేసిన ఎమ్మెల్యే**

**ఆసుపత్రి అభివృద్ధికి సహకరిస్తా**

ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే పేషెంట్లకు సకాలంలో మెరుగైన వైద్యసేవలను అందించాలని పలమనేరు ఎమ్మెల్యే అమర్నాథరెడ్డి సూచించారు.వీ.కోట మండలకేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని బుధవారం సాయంత్రం ఆయన ఆకస్మికంగా తనిఖీచేశారు.ఈ సందర్భంగా ఆసుపత్రిలో ఓపి శాతం ఎంత ఉందని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా పేషెంట్లకు సరిపడా సౌకర్యాలు ఉన్నాయా అని ఆరా తీశారు.ఆస్పత్రిలో పోస్ట్ మార్టం గదిని ఏర్పాటు చేయించాలని వైద్యులు కోరారు.అదేవిధంగా పేషంట్లు అధిక సంఖ్యలో వస్తుండడంతో ఆసుపత్రిని వందపడకలకు పెంచి అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రితో చర్చిస్తానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే వైద్యులకు తెలిపారు. ఇంకేమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ఆసుపత్రి అభివృద్ధికి సహకరిస్తానన్నారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు రంగనాథ్,సీనియర్ నాయకులు రామచంద్ర నాయుడు,రాంబాబు, చౌడప్ప, ప్రధాన కార్యదర్శి ఈశ్వర్, యువ నాయకులు ధీరజ్,శబరీష్ లతో పాటు ఆసుపత్రి వైద్యులు మురళీ మరియు సిబ్బంది తదితరులు ఉన్నారు.



# ఐదుగురు పందుల దొంగలు అరెస్ట్ : 9లక్షల 29వేల విలువగల చోరీసొత్తు స్వాధీనం



**పలమనేరు జూలై 17 :(పెన్ పవర్)**పలమనేరు నియోజకవర్గ పరిధిలో గతరెండు నెలలుగా జరిగిన పందుల వరుస దొంగతనముల నేపధ్యంలో మంగళవారం గంగవరం సి.ఐ.చిన్నగోవిందు మరియు ప్రత్యేక దర్యాప్తు బృందం మదనపల్లి శివార్లలోని నిమ్మనపల్లి క్రాస్ వద్ద 5మంది ముద్దాయిలు, 35 పందులు దొంగతనముకు ఉపయోగించిన లగేజ్ వాహనం మరియు ఒక మోటార్ సైకిల్ ను స్వాదీనం చేసుకొని అరెస్ట్ చేశారు.సదరు ముద్దాయిలు ఇచ్చిన వాంగ్మూలం మేరకు గతంలో కూడా అనంతపురం జిల్లాలో పందుల దొంగతనాలు చేయడంలో అనుభవం కలిగి,గత రెండు నెలలలో గంగవరం మరియు పంజాణి మండలాలలో సుమారు 112 పందులను దొంగతనం చేసి వాటిని లగేజ్ వాహనంలో, మదనపల్లి శివార్లలో పందులు వ్యాపారం చేసేవారికి ఒక కేజీని రూ 190కి అమ్మినట్లు ఒప్పుకున్నారు. నిందితుల నుండి దొంగతనం అయిన 82 పందులు,పందులు అమ్మిన డబ్బు రూ 1లక్ష,71వేల రూపాయలు రికవరీ చేశామని తెలిపారు.

**డిఎస్పీ.విష్ణురఘువీర్ ఆధ్వర్యంలో మీడియా సమావేశం**

అరెస్టుచేసిన నిందితులను మరియు చోరీ చేసిన సొత్తును పలమనేరు డిఎస్పీ విష్ణురఘువీర్ ముందు మీడియా సమావేశంలో చూపారు.అనంతరం డిఎస్పీ మాట్లాడుతూ.. చోరీ కేసులో ముద్దాయిలను పట్టుకోవడంలో ప్రతిభ చూపిన ఐడి పార్టీ సిబ్బంది శ్రీనివాసులు, అశోక్,అల్లా ఉద్దిన్, శశిధర్,శేషాచలం లను పై అధికారులు అభినందిచడమే కాకుండా రివార్డ్ లకు కూడా సిఫారసు చేశారన్నారు. రాయలసీమ జిల్లాలకు చెంది నేరానికి పాల్పడ్డ చంద్రశేఖర్,డేరంగుల విజయ్,ఎరుకుల వాసు,బెస్త రాకేష్,శెట్టి సురేంద్ర లను అరెస్టు చేశామన్నారు.

రికవరీ చేసిన పందులు

గంగవరం మండలం, బెస్తనిపల్లి వద్ద దొంగతనం కాబడిన 47 పందులు,అరసనపల్లి వద్ద దొంగతనం కాబడిన 35 పందులు, పంజాణి మండలం, రాజుపల్లి వద్ద దొంగతనం కాబడి అమ్మిన పందుల డబ్బు రూ. 1లక్ష 71వేలు,పందులు దొంగతనముకు ఉపయోగించిన 02 వాహనములు,ఇలా మొత్తం రికవరీ కాబడిన 112 పందుల యొక్క విలువ సుమారు రూ 9లక్షల,29వేల రూపాయలుగా ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.



# అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

రోడ్డు పనులకు భూమిపూజ మరియు ఆర్వో ప్లాంట్ ప్రారంభం



**పలమనేరు జూలై 17,(పెన్ పవర్):**ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల మేరకు నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు పలమనేరు అమర్నాథ్ రెడ్డి శ్రీకారం చుట్టారు. ఎన్నికల ఫలితాల అనంతరం మొదటిసారి ఆయననియోజకవర్గ పరిధి పెద్దపంజాణి మండలంలోని మాదనపల్లి పంచాయతీ నందు కత్తార్లపల్లె నుంచి కర్ణాటక బార్డర్ వరకు 2.15 కి.మీ మేర రూ1.52 కోట్లతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు బుధవారం భూమిపూజ నిర్వహించారు.

అదే విధంగా అప్పినపల్లి పంచాయతీ కేంద్రంలో ఎన్టీఆర్ సుజల స్రవంతిలో భాగంగా ఆర్వో ప్లాంటును సైతం ప్రారంభించారు.ఎన్నో ఏళ్ల నుంచి కత్తార్లపల్లె గ్రామస్తులు ఎదుర్కొంటున్న రోడ్డు సమస్య దీంతో పరిష్కారం కానుంది. ఎన్నికల ఫలితాలు వెలువడిన నెల రోజులలోనే అభివృద్ధి పనులపై అమరనాథరెడ్డి దృష్టి సారించడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులోనూ అన్ని అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను అంచలంచెలుగా పూర్తి చేసుకుందామని ఈసందర్భంగా గ్రామస్తులకు ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమాలలో పెద్దపంజాణి మండలం నాయకులు విజయభాస్కర్ రెడ్డి,నాగరాజు,శంకర్,కృష్ణారెడ్డి,భానుప్రకాష్ రెడ్డి మరియు కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

**జీవితాంతం రుణపడి ఉంటా : ఎమ్మెల్యే అమర్నాథ రెడ్డి**

తన గెలుపుకు సహకరించిన ప్రతి ఒక్కరికి జీవితాంతం రుణపడి పలమనేరు ఎమ్మెల్యే అమర్నాథరెడ్డి పేర్కొన్నారు.బైరెడ్డిపల్లి మండలంలోని నాగిరెడ్డిపల్లిలో బుధవారం ఆయన రూ. 67 లక్షలతో ఏర్పాటు చేయనున్న సిసి రోడ్డుకు భూమి పూజ చేపట్టారు.ఈ సందర్భంగా గ్రామస్తులు ఆయనకు పండుగ వాతావరణం తలపించేలా ఘన స్వాగతం తెలియజేసి సన్మానించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....తనపై నమ్మకంతో ఓట్లు వేసి గెలిపించిన ప్రతి ఒక్కరికీ రుణపడి ఉంటానని పలమనేరు నియోజకవర్గ అభివృద్ధికి శాయశక్తులా పని చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కిషోర్ గౌడ,ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యం శెట్టిలతో పాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.